క్లుప్తంగా

వరికోతలు ప్రారంభం



వరి పంట కోస్తున్న యంత్రం

ఓజిలి: మండల పరిధిలోని ఓజిలి తదితర గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. ఈ గ్రామాల్లో ఎల్డిపైరు కింద 500 ఎకరాలలో వరిని సాగు చేశారు. ప్రస్తుతం పంటలు కోతకు వచ్చాయి. రైతులు వరికోత యంత్రాలతో పంటలను కోస్తున్నారు. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులకు ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. ఎకరానికి కేవలం 15 నుంచి 20 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. సరైన ధలు లేకపోవడంతో రైతులు పండిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సైదాపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం గూడూరులోని సిద్ధార్థ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ వైద్యులు తలమంచి వినోద్‌కుమార్ రెడ్డి, దువ్వూరు లక్ష్మీ సుధ పాల్గొని రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరానికి అధిక సంఖ్యలో రోగులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెందోటి శారద, ఉపసర్పంచ్ శివకుమార్, రమేష్, సాంబయ్య, అశోక్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.

వైఎస్ ఎంపీపీకి ఎమ్మెల్సీ పరామర్శ



సిద్ధవరంలో పెంచలరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరు: మండల ఉపాధ్యక్షుడు పోలంరెడ్డి పెంచలరెడ్డిని ఆదివారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు. సిద్ధవరం గ్రామానికి చెందిన వైఎస్ ఎంపీపీ పోలంరెడ్డి పెంచలరెడ్డి గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న మేరిగ మురళీధర్ ఆయన గృహానికి చేరుకుని ఆరోగ్య విషయాలపై ఆయన కుమారుడు పోలంరెడ్డి ప్రసాద్‌రెడ్డితో చర్చించారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి, హరనాథ్‌రెడ్డి, కలపాటి మధుసూదన్ రెడ్డి, రవికుమార్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

జాతీయ పోటీలకు భరత్ మహీపతి



బంగారు పతకం సాధించిన భరత్ మహీపతి

చిట్టమూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేసే భరత్ మహీపతి అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలలో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆదివారం ఆయన తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో హేమర్ త్రోలో విజయం సాధించి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. దీంతో ఆయన మార్చి నెల 8, 9, 10వ తేదీలలో బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం మీనాకుమారి ఆయన్ను అభినందించారు.

అభివృద్ధి.. శిథిలం

గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో పలు ప్రభుత్వ భవనాలు నిర్మాణ దశలోనే శిథిల స్థితికి చేరుకుంటున్నాయి. కోట్లాది రూపాయల నిధులు ఉన్నా ప్రభుత్వ నిర్లక్ష్యంతో భవన నిర్మాణ పనులు ఆగిపోతున్నాయి. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంపై కంటగింపుతో అర్ధంతరంగా భవన నిర్మాణాలు ఆపేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజా ధనం బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలిపోతోంది. అసంపూర్తిగా మిగిలిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, ఉపయోగంలోకి తీసుకువస్తే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.

సైదాపురంలో గతంలో వేసిన పునాది



సైదాపురం మండల పరిషత్ కార్యాలయ నిర్మాణంలో దర్శనమిస్తున్న పునాది కమ్ములు



పునాదులకే పరిమితం

– నిర్మాణం పూర్తికాని మండల పరిషత్ కార్యాలయం

సైదాపురం: నిధులు పుష్కలంగా ఉన్నా భవన నిర్మాణ పనులు మాత్రం పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో ఆ కార్యాలయం సిబ్బంది మరో భవనంలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. మండల పరిషత్ భవన నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయోనని ప్రజలంతా ఎదురు చూపులు చూస్తున్నారు. మండల కేంద్రమైన సైదాపురంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయ భవనం ఉరుస్తుండడంతో 2022లో భవనాన్ని కూల్చేశారు. భవన నిర్మాణానికి జిల్లా పరిషత్‌తోపాటు మండల గ్రాంట్ నిధులు రూ.కోటి 40లక్షల వ్యయంతో పనులను ప్రారంభించారు. పునాదుల నిర్మాణానికి రూ.7.50 లక్షల నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే నేటికి కూడా పనులు అలాగే నిలిచిపోయాయి. కేవలం పునాదుల్లోని కమ్ములు మాత్రమే దర్శనమిస్తున్నాయి. జిల్లా పరిషత్, మండల నిధులు కూడా పుష్కలంగా ఉన్నా కూడా పనులు అలాగే ఉండడం ఆశ్చర్యకరం. ఇకనైనా భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

త్వరలోనే మండల పరిషత్ కార్యాలయ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నిధులు కూడా పుష్కలంగా ఉన్నాయి. పనులు ప్రారంభించిన వెంటనే వేగవంతంగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తాం

– పురుషోత్తం శివకుమార్, ఎంపీడీఓ, సైదాపురం

శిథిలావస్థలో సంపద తయారీ కేంద్రం



శ్రీధనమల్లిలో శిథిలావస్థకు చేరిన సంపద తయారీ కేంద్రం

దొరవారిసత్రం: పంచాయతీ కేంద్రమైన శ్రీధనమల్లి గ్రామ పరిధిలో సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. దీనికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాల్సిన పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఏడేళ్ల కిందట అప్పటి టీడీపీ హయాంలో నిర్మించిన సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి రాకనే శిథిలావస్థకు చేరడం గమనార్హం. ప్రస్తుతం షెడ్‌కు వేసిన రేకులు తుప్పు పట్టిపోయి, గోడలు పగుళ్లు ఇచ్చి దారుణంగా దర్శనమిస్తోంది. గ్రామంలో చెత్తను సేకరించి ఈ కేంద్రంలో ఎరువులు తయారు చేసిన దాఖలాలే లేవు. ప్రస్తుతం శిథిలాస్థకు చేరిన తయారీ కేంద్రం మందుబాబులకు బారుగా, ఆకతాయిల చీకటి కార్యక్రమాలకు నిలయంగా మారింది.

అసంపూర్తి నిర్మాణాలు



అసంపూర్తిగా విలేజ్ క్లినిక్, రైతు సేవా కేంద్రం భవనాలు



పునాదులు దాటని గ్రామ సచివాలయ భవనం

దొరవారిసత్రం: వేణుంబాకం గ్రామ పరిధిలో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతు సేవా కేంద్రం భవనాలు నిర్మాణ దశలోనే పాడుబడ్డాయి. వీటిని ఒకే ప్రాంగణంలో నిర్మించడానికి తలపెట్టారు. అయితే గత మూడేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇందులో విలేజ్ క్లినిక్, రైతు సేవా కేంద్రం భవనాలు మాత్రం శ్లాబ్ స్థాయికి చేరగా సచివాలయం భవనం పునాదులు దాటలేదు. ఏళ్ల తరబడి అలాగే ఉండిపోవడంతో ఈ భవనాలు దయనీయస్థితిలో దర్శనమిస్తున్నాయి. ప్రజలు, రైతులు, రోగుకులకు సేవలందించాల్సిన భవనాలను అన్ని వసతులతో పూర్తి చేయించాల్సిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ఈ భవన నిర్మాణం పనులు స్థానిక ప్రజలకు కలగానే మిగిలాయి.

అరాచక పాలన సాగుతోంది

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



బాధితుడు సతీష్‌యాదవ్‌ను పరామర్శిస్తున్న నాయకులు

గూడూరు రూరల్: ఎన్నికల అనంతరం గూడూరు నియోజకవర్గంలో టీడీపీ అరాచక పాలన కొనసాగిస్తోందని, ఇది ఎక్కువ రోజులు కొనసాగదని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని మంగళపూరు గ్రామంలోని ఓ యువకుడ్ని పోలీసులు చిత్ర హింసలకు గురి చేయడంతో ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన రెడ్డితో కలసి ఆయన పరామర్శించారు. బాధితుడు సతీష్‌యాదవ్ కుటుంబం గోడును విన్నారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రశ్నించిన వారిపై పోలీసులతో అక్రమ కేసులు నమోదు చేయించడం దారుణమన్నారు. బాధితు భార్య నిండు గర్భవతి అని తనను రాత్రి సమయంలో స్టేషన్‌లో ఉంచవద్దని వేడుకున్నా కనీసం కనికరం లేకుండా చితకబాదారన్నారు. ప్రతి కార్యకర్తకు భరోసా కల్పించేలా ఇకపై నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తామన్నారు. యద్దల నరేంద్రరెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య, కొండూరు సునీల్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, మెట్టా రాధాక్రిష్ణారెడ్డి, వాయిగండ్ల నాగరాజు, సంపత్‌కుమార్‌రెడ్డి, దేగపూడి క్రిష్ణారెడ్డి, జనార్దనరెడ్డి, ప్రభాకర్‌రాజు, కొట్టు గోవర్ధన్, రాజీవ్‌రెడ్డి, సర్పంచ్ వసంత్‌రెడ్డి, అట్ట శ్రీనివాసులురెడ్డి, కొట్ట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో అదనపు భవనాలు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని చింతవరం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా అదనపు భవనాలు నిర్మించేందుకు ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శంకుస్థాపన చేసారు. ఆసుపత్రిని గత ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో నిర్మించగా వీటికి అనుబంధంగా రూ.39.81 లక్షలతో అదనపు భవనాలు నిర్మించేందుకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అదనపు భవనాలలో ల్యాబ్, స్టోర్‌రూం, రిసెప్షన్, కంప్యూటర్ రూం, టాయిలెట్‌లు, వెయిటింగ్ హాల్ ఉంటుందని అన్నారు. ఈ అదనపు భవనాల పర్యవేక్షణ ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన తెలిపారు.

చిట్టమూరులో..,

చిట్టమూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు భవనాలు నిర్మించేందుకు ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ భూమి పూజ చేశారు. ఆసుపత్రి ఆవరణలో రూ.31.81 లక్షలతో అదనపు భవానాలను నిర్మించేందుకు శ్రీకారం చుడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ భవనాలలో ల్యాబ్, సమావేశ మందిరం, రిసెప్షన్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ మనోహర్‌గౌడ్, వైద్యులు పద్మావతి, ఆర్‌ఐ నిరంజన్, ఏపీఎం గుణయ్య, ఎస్‌ఐ చినబలరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



ఆలయం వద్ద పేదలకు అన్నదానం

నాయుడుపేట టౌన్: పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున్న ఉన్న శ్రీప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద మృత్యుంజయ హోమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భీష్మ ఏకాదశి మహోత్సవం ముగింపు వేడుకల సందర్భంగా ఆలయం వద్ద ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యంలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద వందలాది మంది పేదలకు భక్తులు అన్నదానం చేశారు. మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, ఇందిరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. ప్రధానార్చకులు బాలాజీ స్వామి, గూడూరు ప్రభావతమ్మ, ఉగ్గముడి భాస్కర్‌రెడ్డి, చిట్టేటి అంకయ్య, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 53.894 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 53.894 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట): రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం రాత్రి 8.20 గంటలకు శ్రీకాళహస్తి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికురాలి బ్యాగును ఓ వ్యక్తి చోరీ చేశాడు. అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. అతను రైల్వే స్టేషన్ వైపు పరుగులు తీశాడు. పోలీసుల నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా సీనియర్ క్రికెట్ పోటీలు

చిల్లకూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీనియర్లు 7 జట్లుగా ఏర్పడి ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో రెండు రోజులపాటు క్రికెట పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో పోటీ పడ్డ సిలికా లెవన్స్‌పై గ్రావెల్ లెవన్స్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీనియర్ క్రికెటర్లు పదహారేళ్లుగా నిర్విరామంగా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. అనంతరం విజయం సాధించిన గ్రావెల్ లెవన్స్ జట్టుకు కప్పును అందించారు. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు మదు, రఘుబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

గూడూరు రూరల్: పట్టణంలోని కరణాల వీధికి చెందిన ఓ వ్యక్తి బ్యాటరీ బైక్ షార్ట్ సర్క్యూట్ కారణం ఆదివారం దగ్ధమైంది. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ బైక్‌కు చార్జింగ్ పెట్టే సమయంలో ఒక్క సారిగా పొగలు రావడంతో అప్రమత్తమై చార్జింగ్ తీసివేశానన్నారు. అప్పటికే బ్యాటరీ వద్ద పొగలు రావడంతోపాటు షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంటిలోని పలు రకాల విద్యుత్ వస్తువులు కూడా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

నత్తనడకన మహాశివరాత్రి పనులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి మార్చి 6 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యతో తరలివస్తారు. వారికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో అధికారులు ఉత్సవాల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఏర్పాట్లకు సంబంధించిన పనులు చేపట్టలేదు. పోస్టర్లను ఆవిష్కరించలేదు. ఆహ్వాన పత్రిక ఇంకా తయారు కాకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇవ్వలేదు. ధూర్జటి ప్రాంగణంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి ప్రముఖులు ఎవరు పాల్గొంటారనే అంశంపై ఇంత వరకు అవగాహన లేదు. అలాగే ముగ్గులు, రంగులు వేసే పనులు నత్తనడకన సాగుతున్నాయి. క్యూలైన్ల ఏర్పాటు, మరుగుదొడ్లు, తాగునీరు, తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. అద్దెగదులన్నీ ఆలయానికి వచ్చే వీఐపీలకే సరిపోతున్నాయి. భక్తుల బస కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఉత్సవాల సమయం దగ్గరపడుతున్నా అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సత్తెమ్మ తల్లికి పాల పొంగళ్లు



విశేష పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన సత్తెమ్మతల్లి



సత్తెమ్మకు పొంగళ్లు పెట్టుకుంటున్న మహిళలు

కలువాయి: తోపుగుంటలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మ తల్లికి ఆదివారం గ్రామస్తులు పాల పొంగళ్లు పెట్టుకున్నారు. ప్రతి ఏటా ఒక వారం తోపుగుంటవాసులు, మరోవారం అగ్రహారంవాసులు సత్తెమ్మకు పొంగళ్లు పెట్టుకోవడం ఆనవాయితీ. మొదటగా ఈ ఆదివారం తోపుగుంటవాసులు సత్తెమ్మకు పాల పొంగళ్లు పెట్టుకున్నారు. సత్తెమ్మను పూలతో విశేషంగా అలంకరించి ఆలయంలో పూజలు చేశారు. సత్తెమ్మ తల్లి ఆశీస్సులుంటే గ్రామం భోగభాగ్యాలతో అలరారుతుందని గ్రామస్తుల నమ్మకం. ఆదివారం ఈ కార్యక్రమానికి గ్రామం మొత్తం మేళతాళాలతో ఊరేగింపుగా సత్తెమ్మ గుడి దగ్గరకు తరలివచ్చింది. పూజలు చేసి, పొంగళ్లు పెట్టి, అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తోపుగుంటవాసులు, చుట్టుపక్కల గ్రామాల వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అడ్డుగా ఉన్నా.. తొలగించరా?

- రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు
- తొలగించకుండానే రోడ్డు నిర్మాణం



స్తంభాలు తొలగించకుండానే వేసిన సీసీ రోడ్డు

సైదాపురం: అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. రోడ్డు వేసే ముందుగానే ఆయా మార్గాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలతోపాటు బంకలను తొలగించిన తర్వాతనే రహదారి నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉంటుంది. అవేవీ పట్టించుకోకుండానే రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంపై మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. అందుకు ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం.

మండల కేంద్రమైన సైదాపురంలోని ప్రధాన కూడలిలోని పాదలకూరుకు వెళ్లేందుకు ప్రభుత్వం రూ.45 కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పదిమీటర్ల రహదారి పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లు కనుసన్నల్లోనే పనులు జరగతుండడం గమనార్హం. కోట్లాది రూపాయల వ్యయంతో జరుగుతున్న పనులను పర్యవేక్షించాల్సిన అధికారులెవ్వరూ పనులు జరిగే చోట్ల లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. మండల కేంద్రమైన సైదాపురంలోని రాపూరు క్రాస్‌రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు పనులు చేస్తున్నారు. రోడ్డుకు మధ్యలో రెండు విద్యుత్ స్తంభాలు ఉన్నాయి.అవి కూడా ప్రమాద భరితంగా ఉన్నాయి. ఈ రెండు విద్యుత్ స్తంభాలను తొలగించకుండా అలాగే రోడ్డు మార్జిన్‌కు అడ్డుగానే ఉన్న మరో మూడు స్తంభాలను కూడా తొలగించకుండానే సీసీ రోడ్డును వేయడంతో సైదాపురం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు వేయడంతో తమ పని అయిపోయిందంటూ సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు నిర్లక్ష్యానికి మారుపేరుగా మారింది.

జోరుగా బెల్టు దందా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని విషయాల్లో అరాచకం రాజ్యమేలుతోంది. 2024లో కూటమి ప్రభుత్వం రావడమే తరువాయి ప్రభుత్వ మద్యం షాపుల విధానాన్ని రద్దు చేసి ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సిండికేట్‌గా మారి బెల్టు షాపులు ఏర్పాటు చేసి దోచుకోవడం ప్రారంభించారు.

- టీడీపీ నాయకుల కనుసన్నల్లో బెల్టుషాపులు
- 10 వేలు డిపాజిట్ చెల్లిస్తే బెల్టు దుకాణం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు

సూళ్లూరుపేట: తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం ఇస్తామని గొప్పలు కూడా చెప్పారు. ఇప్పుడేమో బెల్టుషాపుల్లో మద్యం బాటిల్‌పై ఉన్న ఎంఆర్‌పీ ధరలకంటే రూ.50 అధికంగా పెట్టి అమ్ముకుంటున్నారు. అయితే ఎక్సైజ్‌శాఖలో సెబ్ అనే ప్రత్యేక వింగ్ కూడా కార్యాలయానికే పరిమితమైపోయింది. సూళ్లూరుపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం 59 గ్రామ పంచాయతీలు, ఒక్క మున్సిపాలిటీకి సంబంధించి 21 మద్యం షాపులు ఏర్పాటు చేశారు. కల్లుగీత కార్మికులు పేరుతో మరో మూడు షాపులు ఏర్పాటు చేయనున్నారు.

అధిక ధరలకే మద్యం విక్రయం

సాక్షాత్తూ ఎక్సైజ్ అధికారులే సూళ్లూరుపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్న 21 షాపులను సిండికేట్‌గా మార్చారు. ఎక్సైజ్‌శాఖ పరిధిలోని 59 గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించాలంటే రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలి. తర్వాత ఒక్కో గ్రామంలో ఎన్ని షాపులైనా నిర్వహించుకునే వీలు కూడా కల్పించారు. దీంతో గ్రామాల్లో బెల్టుషాపులు విపరీతంగా పెరిగిపోయాయి. వంద రూపాయలకు ఇచ్చే మద్యం బాటిల్‌ను రూ.150కి అమ్మేస్తున్నారు. బెల్టుషాపుల పేరుతో మద్యం షాపుల నిర్వాహకులు మందు బాబులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సూళ్లూరుపేట మండలం మతకామూడి గ్రామంలో ఒక్కరే బెల్టుషాపు నిర్వహించుకునేందుకు వేలంపాట పెడితే రూ.5.20 లక్షలు పెట్టి పాడుకున్నారు. అదే విధంగా దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లిలో రూ.1.60 లక్షలు పెట్టి వేలం పాడే విషయంలో వివాదం కూడా రచ్చకెక్కి సంచలనంగా మారింది. మద్యం తాగేందుకు సర్వీస్ రూమ్‌లు ఉండకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పెడచెవిన పెట్టి విచ్చలవిడిగా సర్వీస్ రూమ్‌లు నిర్వహిస్తున్నారు. ఇదంతా ఎక్సైజ్ పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ ఏమీ తెలియనట్టుగా వ్యవహరిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇస్తామన్న సూపర్‌సిక్స్ పథకాలను పక్కకు నెట్టేసి గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం ఏరులై పారిస్తున్నారు.



బెల్టుషాపులు నిర్వహణకు వేలం పాట(ఫైల్)



సూళ్లూరుపేట నుంచి పడమటవైపు పల్లెల్లోని బెల్టుషాపులకు తరలుతున్న మద్యం